సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి



వర్షం వస్తే పెరికివీధిలో ఇదీ పరిస్థితి

షికార్లలో కార్పొరేటర్లు

పక్షం రోజులుగా విదేశాల్లోనే స్థానిక ఎమ్మెల్యే

అధికారులకూ పట్టని ప్రజా సమస్యలు

సతమతమవుతున్న జనం

సమస్యల తిష్ట.. నిర్లక్ష్యానికి పరాకాష్ట

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో సమస్యలు తిష్టవేశాయి. అల్లిపురం, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, వెలంపేట, రెల్లివీధి, జాలారిపేట, పాతనగరం, ఫెర్రీరోడ్డు.. తదితర ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మంచినీటి సదుపాయం ఆశించినంతగా లేకపోవడం, శిథిలమైన రోడ్ల తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీ టిపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఎన్నికలొస్తేనే నాయకులు ఇటువైపు చూస్తుంటారని.. ఈ సారి నేతలొస్తే సరైన సమాధానం చెబుతామంటూ ఇక్కడి వారు ఆగ్రహంగా ఉన్నారు.



కాన్వెంట్ జంక్షన్‌లోని పోర్టు ప్రధాన ద్వారం వద్ద ఇలా..



రెల్లివీధి మెయిన్‌రోడ్డుపై దుర్వాసనతో కూడిన మురుగు

విదేశాల్లో ప్రజాప్రతినిధులు..

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పేరిట కార్పొరేటర్లు షికార్లు చేస్తున్నారు. దాదాపు నెల రోజులుగా ఏ ఒక్క కార్పొరేటర్ వార్డులో పర్యటించిన పాపాన పోలేదు. సమస్యలు తెలుసుకున్న రోజు లేదు. ఇదిలా ఉండగా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేస్తాను.. స్థానిక సమస్యలు పరిష్కరించేస్తాను.. పోర్టు కాలుష్యాన్ని తగ్గించేస్తాను.. ఈ విషయాలపై అసెంబ్లీలో మాట్లాడేసానన్న స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకు నామమాత్రపు కార్యక్రమాలు చేశారే తప్ప.. ఏ ఒక్క ప్రజోపయోగ కార్యక్రమం చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం విదేశాలకు వెళ్లి దాదాపు పక్షం రోజులు కావస్తున్నా.. నియోజకవర్గ సమస్యలు ఏ మాత్రం పట్టకపోవడం శోచనీయమని పలువురు మురికివాడ ప్రాంత ప్రజల వాపోతున్నారు.

దాహం.. దాహం

నియోజకవర్గ పరిధి పెరికివీధి, వెలంపేట, లక్ష్మీనగర్, వార్డుబాయికాలనీ, సాలిపేట, తాడివీధి, వెంకటేశ్వరమెట్ట తదితర ప్రాంతాల్లో మంచినీటి బోర్లు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో స్థానికులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఆయా ప్రాంతాల్లోని బోర్లు సరిగా పని చేయడం లేదు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్నా.. సమయపాలన లేకపోవడం, ఎగువ ప్రాంతాలకు నీరు సరిగ్గా అందకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పారిశుధ్యం అధ్వానం..

మురికివాడ ప్రాంతాలను పారిశుధ్య సమస్య వేధిస్తోంది. పధాన రహదారులు, కాలువలు శుభ్రం చేస్తున్నా.. చెత్తను మాత్రం రోడ్లపైనే శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని వాపోతున్నారు. మురుగు, చెత్తా, చెదారాల నిల్వలతో అంటు రోగాల బారిన పడతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించాలంటున్నారు.

మా బాధలు వినే నాథుడేడి?

గల్లీల్లో దీర్ఘకాలిక సమస్యలపై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశాం. ప్రజా ప్రతినిధులు వచ్చి హడావిడి చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఈ వేసవిలోనైనా తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తారని వేడుకుంటున్నాం.

– సారిక దైవకుమార్, ఆశిపాప వీధి

సమస్యలతోనే సావాసం..

కొన్ని నెలలుగా సమస్యలతో సావాసం చేస్తున్నాం. ప్రధానంగా శిథిలమైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్నాం. రాకపోకలు సాగించే విషయమై అవస్థలు పడుతున్నాం. అధికారులకు విన్నవించినా ఎలాంటి ఉపయోగం లేకపోతోంది.

– శ్రీహరిరెడ్డి, అల్లిపురం



బౌడారా రోడ్డులో ఇలా..

క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రెల్లి సామాజిక వర్గానికి న్యాయం చేయాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార: ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని జై గౌతం బాబా సంఘం కన్వీనర్ ఎస్. కళ్యాణ ముని ఆందోళన వ్యక్తం చేశారు. గౌతం బాబా సంఘం, ఏపీ రెల్లి అభివృద్ధి సంఘం, ఇతర రెల్లి సంఘాలతో కలిసి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన దీక్ష నిర్వహించారు. తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెల్లి గ్రూపు కులాలకు 2 నుండి 5 శాతం వరకు రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రెల్లి, ఉపకులాలు ఎప్పుడూ అన్యాయానికి గురవుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 10 లక్షల జనాభా ఉన్న తమకు వర్గీకరణలో 1 శాతం రిజర్వేషన్ ఇవ్వడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వానికి తప్పుడు సమాచారమిచ్చి తమకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. వర్గీకరణలో తమకు జరిగిన అన్యాయంతో తాము, తమ భావితరాలు తీవ్రంగా నష్టపోతామని అన్నారు. ప్రభుత్వం స్పందించి రెల్లి గ్రూపు కులాలకు రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలో రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మధుసూదనరావు, రాష్ట్ర రెల్లి సంఘం ఉపాధ్యక్షుడు వెంకట రావు, వడ్డాది ప్రకాష్, వడ్డాది గోవిందరాజులు, చెన్నా పాల్, మోహన్ కుమార్, రంజిత్ కుమార్, రంజిత తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ క్లబ్ నిర్లక్ష్యం వల్లే బాలుడి మృతి

ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి



మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి. పక్కన సీఐ సత్యనారాయణ

సీతమ్మధార: స్పోర్ట్స్ క్లబ్ నిర్లక్ష్యం వల్ల ఏడేళ్ల బాలుడు రుషి మృతి చెందాడని, మృతిపై కేసు నమోదు చేశామని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి వెల్లడించారు. ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ఘటనలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ యాజమాన్యం నిర్లక్ష్యం ఉందని, వాటర్ పార్క్ వద్ద నైపుణ్యం గల నిపుణులు లేరని అన్నారు. రక్షణ చర్యలు పాటించలేదని, సమయం దాటిన తర్వాత టికెట్ అమ్మకాలు సరికాదని, సరైన అనుమతులు కూడా తమకు చూపించలేదని పేర్కొన్నారు. తల్లి తండ్రులను సమీపంలోకి అనుమతించకపోవడం సరి కాదని స్పష్టం చేశారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీఐ ఎ.సత్యనారాయణ, ఎస్‌ఐ చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇమ్మాన్యుయేల్ లూథరన్ చర్చి పాస్టర్‌గా శ్యామ్‌కుమార్

ఆరిలోవ: ఎంవీపీ కాలనీ సెక్టార్–2లోని ఇమ్మాన్యుయేల్ లూథరన్ చర్చి పాస్టర్‌గా ఫారిస్ పాస్టర్ శ్యామ్‌కుమార్ ఇటీవల నియామకమయ్యారు. ఈ సందర్భంగా తాను బాధ్యతలు స్వీకరించినట్లు బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. చర్చిని పరిపాలన, ఆర్థికపరంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. సంఘస్తులంతా ఐక్యంగా మెలిగి చర్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మొండి వ్యాధులకు మేలైన వైద్యం

నేడు ప్రపంచ హోమియోపతి దినోత్సవం

దాబాగార్డెన్స్: హోమియోపతి ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న ఒక వైద్య పద్ధతి. ముఖ్యంగా భారతదేశంలో దీనికి లభిస్తున్న ప్రజాదరణ మరెక్కడా లేదు. హోమియో వైద్యం రెండు వందల ఏళ్ల నుంచి వాడుకలో ఉంది. హోమియోపతి అన్నది హోమోయిస్ (ఒకే రకమైన), పేథోస్ (బాధ, రోగ లక్షణం) అనే రెండు గ్రీకు మాటలని సంధించగా పుట్టిన మాట. దీనిని తెలుగులో సారూప్య లక్షణ వైద్యం అనొచ్చు. ఉష్ణం ఉష్ణేణ శీతలం అన్నట్టు ఒక పదార్థం ఏ బాధని కలిగిస్తుందో ఆ బాధని నివారించడానికి అదే పదార్థాన్ని మందుగా వాడాలి అన్నది హోమియోపతి మూల సూత్రం. ఈ వైద్య పద్ధతిని, ఈ మాటని కనిపెట్టింది శామ్యూల్ హానిమాన్ అనే జర్మనీ దేశ వైద్యుడు. ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఏప్రిల్ 10న ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటారు.

హానిమన్ హోమియోపతి వైద్యం 3 అంశాలపై ఆధారపడి ఉంటుంది. అందులో మొదటిది ఆర్గనాన్ (హోమియోపతి వైద్య సూత్రాలు), రెండవది హోమియోపతి మెటీరియా మెడికా (హోమియోపతి వస్తుగుణ దీపిక), మూడవది మయాజమ్స్ (దీర్ఘ వ్యాధుల చికిత్స). మొదట ఆర్గనాన్‌ను బాగా చదివి అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత మాత్రమే హానిమన్ ఆర్గనాన్‌లో చెప్పినట్టుగా మెటీరియా మెడికాను బాగా అర్థం చేసుకోవాలి. అనంతరం హానిమన్ చెప్పినట్టుగా చేసే వైద్యాన్ని మాత్రమే హానిమన్ హోమియోపతి వైద్యం అంటారు.

వందల మందికి నయం చేశాం..



ఏప్రిల్ 10 సాయంత్రం హానిమాన్ జయంతిని విశాఖలో హోమియోపతి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకుంటున్నాం. ఇంగ్లీషు మందుల ద్వారా నయం కాని మొండి వ్యాధులు హోమియోపతి ద్వారా నయం అవుతున్నాయి. కరోనాలో వందల మందికి నయం చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి హోమియోపతి ఆదరణ పొందేలా చూడాలి. స్పైనల్, సర్వైకల్, ఆర్థరైటిస్.. తదితర కేసుల్ని ఆపరేషన్ లేకుండా నయం చేశాను. మైగ్రేన్, గ్యాస్ట్రిక్, పీసీవోడీ, చిన్న పిల్లల సమస్యలను నయం చేశాం.

– డాక్టర్ రియాజ్ అహ్మద్, విశాఖపట్నం.

పదోన్నతి కల్పించాలని వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జి.గణేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి చింతకాయల బంగ్రరాజు కోరారు. బుధవారం రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గాజువాకలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఇవ్వాలని, ఇతర శాఖల అదనపు పని బాధ్యతలను తొలగించాలని, అధిక పని వత్తిడి తగ్గించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో విశాఖ జిల్లా నాయకులు పి. అనిల్‌ప్రకాష్, డి. శివ, అలీ మొహిద్దీన్, జి. చందు, డి. భాస్కర్, పి. నవీన్, ఎస్. శివ తదితరులు ఉన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేసి.. ప్రమాదాలు అరికట్టాలి



స్పీడ్‌బ్రేకర్లు లేని యాసీన్ బాబా దర్గా రహదారి

దాబాగార్డెన్స్: నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారు. యువకులు బైక్‌లపై రెచ్చిపోతున్నారు. వారి రైడింగ్‌ల కారణంగా ఎంతో మంది గాయాల పాలవుతున్నారు. రెచ్చిపోతున్న యువత బైక్ రైడింగ్‌లకు స్పీడ్ బ్రేకర్ల ద్వారా ఫుల్‌స్టాప్ పెట్టాలంటూ గత ఏడాదిగా జీవీఎంసీ.. పోలీస్ సిబ్బందికి మొర పెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే కరవవుతున్నాడు. సాక్షాత్తు జీవీఎంసీ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని 38వ వార్డు పరిధి యాసీన్ బాబా దర్గా ప్రాంత వాసి, సంఘ సేవకుడు డాక్టర్ రియాజ్ అహ్మద్ 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో యువకుల బైక్ రైడింగ్ కారణంగా అనేక మంది పిల్లలు పలు ప్రమాదాలకు గురయ్యారని, ఇటీవల ఓ బాలుడిని ఓ యువకుడు బైక్‌తో ఢీకొట్టడంతో, ఆ బాలుడు చెయ్యి విరిగి మంచాన పడ్డాడని, ఇలాంటి తరహా ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ ప్రమాదాలకు చెక్ పెట్టాలంటే.. ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వెంటనే వేయాలని కోరారు.

చండ్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి



చండ్ర రాజేశ్వరరావుకు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు, సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు (సీఆర్) 31వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సీఆర్ వామపక్ష భావజాలం వైపు ఆకర్షితులు అయ్యారన్నారు. ఆయన నిజాయితీ, నిబద్ధత గల నాయకుడని, ఆయన ఆశయాలు సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆచరించినప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినవారం అవుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, సీఎస్ క్షేత్రపాల్, జి.కాసులరెడ్డి, ఎస్.నాగభూషణం, ఎస్.అప్పన్న, లక్ష్మణరావు, నూకరాజు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పందిళ్లు వేశారు.. తాగునీరు మరిచారు

- పూర్ణామార్కెట్, బౌడారా రోడ్డులో చలివేంద్రాల ఏర్పాటుకు అరకొర చర్యలు
- తాగు నీరు కూడా కల్పించాలని పలువురి వినతి



పూర్ణామార్కెట్‌లో చలివేంద్రం కోసం ఏర్పాటు చేసిన పందిరి



బౌడారా రోడ్డులోని పందిరి

జగదాంబ: జీవీఎంసీ ప్రజారోగ్యంపై కనీస శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎండలు మండిపోతున్నా ఎక్కడా చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై అంతా మండిపడుతున్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఏటా మార్చిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చేది. కానీ ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారం పూర్తయిపోయినా ఆ దిశగా కనీస చర్యలు తీసుకోలేదు. అయితే ఇటీవల 'సాక్షి'లో వచ్చిన 'కానరాని చలివేంద్రాలు' అనే అని కథనం వెలువడడంతో హడావుడిగా పూర్ణామార్కెట్‌లో చలివేంద్రాల ఏర్పాటుకు తాటాకు పందిళ్లు వేశారు. అయితే ఆ పందిళ్లలో తాగునీరు మాత్రం ఏర్పాటు చేయలేదు. పూర్ణామార్కెట్‌కు నగరవాసులతో పాటు ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోళ్ల నిమిత్తం వస్తుంటారు. అలా వచ్చే వారు బయట అధిక ధరలు వెచ్చించి మంచినీళ్ల బాటిళ్లు కొనుగోలు చేయలేక అల్లాడుతుంటారు. ముఖ్యంగా రిక్షా పుల్లర్లు, భవన నిర్మాణ కార్మికులు, ప్రయాణికులు ఎండ బారిన పడి వడదెబ్బకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో వారికి మంచినీటి సదుపాయం కల్పిస్తే ఎంతో ఉపశమనం కలుగుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇప్పటికైన జీవీఎంసీ అధికారులు తాటాకు పందిళ్లలో తాగునీరు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చాలని పలువురు కోరుతున్నారు.

మానవ జీవన దిక్సూచి భగవద్గీత



ప్రసంగిస్తున్న వక్త రాధారాణి

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజం కళాశాలలో 'భగవద్గీత, జీవన సాఫల్యత' అనే అంశంపై ప్రసంగం జరిగింది. ముఖ్య వక్త బి.రాధారాణి ప్రసంగిస్తూ భగవద్గీత చదవడం వల్ల వ్యక్తికి తన గమ్యం, శక్తి సామర్థ్యాలతో పాటు ప్రపంచంతో గల సంబంధ బాంధవ్యాలు అర్థమవుతాయని తెలిపారు. మనిషి తన చుట్టూ ఉన్న పరిస్థితులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో గీతలో శ్రీకృష్ణుడు చక్కగా చెప్పినట్టు తెలిపారు. భగవద్గీతలో మానవుడు పరిపూర్ణంగా ఎదగడానికి అనుసరించాల్సిన మార్గం గురించి వివరంగా తెలపబడిందన్నారు. ఈ గ్రంథ పఠనం మనస్సుపై అద్భుతమైన ముద్ర వేస్తుందని, ప్రపంచంలో కోట్లాది మంది చదువుతూ పరమోత్కృష్ట ప్రయోజనాన్ని పొందారని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రసంగాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

లోకో పైలెట్ల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్

తాటిచెట్లపాలెం: ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రన్నింగ్ స్టాఫ్ అత్యవసర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ జె. సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం దొండపర్తిలో గల యూనియన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జోన్‌లో మాత్రమే రన్నింగ్ స్టాఫ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రైల్వే బోర్డు నిబంధనలను పాటించకుండా, రన్నింగ్ స్టాఫ్‌పై పని ఒత్తిడి అధికం చేస్తున్నారని తెలిపారు. ఈ జోన్ పరిధిలో గల వాల్తేర్, సంబల్‌పూర్, ఖుర్దారోడ్ డివిజన్లలో కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ ఉద్యోగులపై పనిభారం పెంచుతున్నారన్నారు. ప్రధానంగా రన్నింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న 6 సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. లోకో సిబ్బందికి మినిమం గ్యారంటీడ్ కిలోమీటర్లు వర్తింపజేయడం లేదని, తొమ్మిది గంటల పని వేళలకు దక్కవలసిన ప్రతిఫలం నిబంధన ఇక్కడ అమలు చేయడం లేదని, రన్నింగ్ సిబ్బందికి సరైన రెస్ట్‌రూంలు లేక విశ్రాంతి కూడా తీసుకోలేకపోతున్నారని తెలిపారు. ఈ విషయమై మార్చి 26వ తేదీన ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రమేష్ చంద్ర సాహూ, జనరల్ మేనేజర్‌కు 12 పేజీల వినతిపత్రం అందజేశామన్నారు. అయితే దీనిపై ఇంత వరకు స్పందించలేదని సంపత్‌కుమార్ తెలిపారు. రన్నింగ్‌స్టాఫ్ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 18వ తేదీ నుండి నిరాహారదీక్ష ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. నరసింగరావు, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి. మాళీశ్వర్రావు, కేంద్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ఎస్ఎల్ కోటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణకు ఆదరణ



బాలభాను పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మురళీనగర్: స్థానికంగా నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులకు ఆదరణ పెరుగుతోంది. ఈ ప్రాంతంలోని కంచరపలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్), బాలభాను పాఠశాలలో మాధవదార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బాలభాను పాఠశాలలో నిర్వహిస్తున్న తరగతులకు హాజరవుతున్న వారి సంఖ్య 54కు చేరిందని క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి చెప్పారు. వీరికి ఉచితంగా మెటీరియల్ అందిస్తామని తెలిపారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 200 మంది, గైస్‌లో 161 మంది విద్యార్థులు చేరినట్లు ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.నారాయణరావు, డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. వీరందరికి టెక్నికల్ ఎడ్యుకేషన్ ముద్రించిన స్టడీ మెటీరియల్ అందిస్తామని వారు తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణ మేళా

ఆరిలోవ: జీవీఎంసీ జోన్–2 పరిధిలో బుధవారం బీసీ కార్పొరేషన్ రుణ మేళా నిర్వహించారు. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద జీవీఎంసీ కల్యాణ మండపంలో 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు బీసీ లబ్ధిదారుల కోసం జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, పలు బ్యాంకుల మేనేజర్లు రుణ మేళా ఏర్పాటు చేశారు. బీసీ లబ్ధిదారుల నుంచి రుణం కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ రుణాలు పొందిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు కెల్ల సునీత, మద్దిల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎస్‌ఏ-2 పరీక్షలు

కంచరపాలెం: పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్-2ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, కప్పరాడ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

డ్రాపవుట్ విద్యార్థుల చేరిక

ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో చదివి, మూడు నెలల క్రితం పాఠశాల మానేసిన దువ్వి వంశీకుమార్, రాజులను డీఈవో స్వయంగా పాఠశాలల్లో చేర్పించారు. గోపాలపట్నం మండల పరిధిలోని 7 ప్రభుత్వ పాఠశాలల నుంచి 9 మంది డ్రాపవుట్ విద్యార్థులను చేర్పించామని తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com